# 8 సిపాయి

చదువులలో స్కూలుఫైనల్ ఇంటర్మీడియేట్లుగాని, సొంత కల్యాణాలలో బ్లేడ్లుగాని, పౌడర్లుగాని అప్పటికింకా అవతారం ఎత్తలేదు. గుంటూర్లో మెట్రిక్యులేషన్ పరీక్షకు వెళ్ళే విద్యార్థులు కొందరు చదువు సంధులకు ఒక మేడ అద్దెకు పుచ్చుకున్నాం. అందులో ఇరవై గదు లుండేవి. పాతిక రూపాయిలు దానికి అద్దె. కాశీదాసు అగ్రహారంలో పూటకూళ్ళు తింటూ ఉండేవాళ్ళం. మూడుపూటలా పెట్టేవాళ్ళు. అప్పటికి కాఫీలు లేవు. నాకు నాలుగు రూపాయలూ, మా అన్నయ్యకు ఐదు రూపాయలూ తీసుకునేవారు. ఆ ముసలమ్మా, ఆమె కూతురూ, ఆమె అల్లుడూ ఎక్కడ ఉన్నారోకాని, నన్ను క్షమించాలి. ఏమంటే నేను వాళ్ళను తెగ భూషించేవాణ్ణి. పండుగ వచ్చిందంటే పట్టుకుని మరీ తలంటిపోసి వదలి పెట్టేవాళ్ళు. చక్రాంకితాలు వేసినంతపనీ అయేది. ఐతే ఆ తలంటు ఖర్చు కూడా ఆ నాలుగు రూపాయలలోనే అంతర్గతం. నాకూ ఆ తలంటుకూ వుండుకున్న ఆ విరోధం చెప్పవలసివస్తే ఆ ఫ్రాయిడ్డే చెప్పాలి.

అతడయినా చెప్పగలగడానికి కొన్ని లక్షణాలు చెబుతాను:- నాకూ ఆ తలంటుకూ ఉన్న విరోధం ఉపమాలంకారాలతో చెబితే విరక్తుడికి సంసారంవతూ రూపకంతో చెబితే అభ్యంజనయుద్ధం. అతిశయోక్తితో చెపితే నరకం. ఐతే ఆ ఫ్రాయడ్నెందుకు ఇందులో దింపడం? ఇందులో కూడా సెక్స్ కనిపిస్తుం దాయనకు. ఏదో మనకు తెలిసినంతలో మనం చెప్పుకుందాం. ఐతే ఇది నలుగురికి తెలిసిందే చూడండి :

నలుగు పెట్టడమంటే—

తిక్కన చెప్పినట్లు—"నున్న(దనంబుగా నలు(గు నూఱియు" గను కనా? ఇసక పిసక్కపోతే మట్టెల్లా పోతుందీ? కాబట్టి నలుగు పెట్టడమంటే ఎలుగుబంటికి తంటసం పట్టడం.

తలమీద నూనె అంటడం అంటే—జుట్టు పీకెయ్యడం. వేన్నీళ్ళు పోయడమంటే—చర్మం ఒలిచేయడం.

ఈ సంగతులు చాలా మందికి తెలుసు. అసలు సంగతికి చాలా దూరంగా వచ్చాం. ఐతే పనిలో పని మరి కొంచెం దూరంపోయి ఆ నాలుగు రూపాయిల పూటకూళ్ళ కుటుంబానికి మొక్కడం మాత్రం మరిచేపోక తరవాయి ఆరంభిస్తా.

ఆ కాలంలో మెట్రిక్యులేషన్ మూడేండ్లయినా తప్పకపోతే ఇంగ్లీషు వచ్చినట్లు కాదు. ఎన్నేండ్లు తప్పితే అంత విలువ. ఆ **Pass**కు లేకపోయినా ఆ **Candidate**కు ఆ మనిషికి ఉండేది. అట్టి విలువ కల మనుష్యులను ఇప్పటికీ తాలూకా కచేరీ వగైరా మ్యూజియాలలో మహారాజులా చూడ వచ్చు.

నేను ముఖ్యంగా మూడు దండయాత్రలుచేసి నాలుగోయాత్రకు నలుగురి నోళ్ళలోనూపడి చెన్నపట్నం కొట్టుకెళ్ళాను. విక్టోరియా హాస్టల్లో మకాం ఇప్పుడొచ్చిన స్వరాజ్యం దాని ముందొక రాజ్యంటండీ? ఇస్ బలా దూర్.

వర్ణాశ్రమాచార వ్యత్యయం లేకుండా ముక్కుబంటిగా భోంచేసే వాండ్లం. "న పలాండుం భక్షయేత్." ఇస్లాం భాయీలు గోపూజచేస్తూ విడిగా నాష్తా చేస్తూ వుండేవాడ్లు. రాత్రి పదిగంటలయిన తరువాత హిందూ ముసల్మాన్ ఏక్ హో గా తెల్లవార్డన్ మీ(ద క్విస్లింగ్‌లులేని మహా-కట్టుకట్టి

దాంతోపాటు గోడమీంచి మఱ్ఱిచెట్టుమీదికి తాడుకట్టి దాని పట్టుకు వేలాడి దిగి విక్టోరియా పబ్లిక్‌హాల్‌లో బళ్ళారివారి నాటకాలకు హాజరయ్యేవాళ్ళం. స్వరాజ్యమంటే అదీ! అంతా స్వ-తంత్రం! అంతా యథేష్టం! డబ్బుకలంత వరకూ అనుభవించగల సుఖం. అప్పటికి సోషలిస్టులూ, మార్క్సిస్టులూ జాంతానై.

అద్ద మొకటి నా గది అలంకరించింది. అద్దంలో చూచుకోవడం కొత్త క్రాపింగ్ దువ్వుకోవడం. మాట్లాడుతూ మాటాడుతూ అద్దం చూచు కోవడం క్రాపింగ్ దువ్వుకుంటూ వుండడం. ఒక వెంట్రుక అటు తొలగితే ఒక అర్థం. ఒక వెంట్రుక ఇటు తొలగితే మరొక అర్థం. వెనుక పతంజలి చెప్పాడు. పాణినిట దర్భలు చేత్తో పుచ్చుకుని. (తద్దినానికి కాదు. పవిత్రతకు ఇప్పుడు సిగరెట్ లాగు.) తూరుపు మొగంపెట్టి కూచుంటాట్ట. ఆయన రెప్పవాల్చాడా దానికి అర్థం ఉందట. వేలెత్తాడా దానికి అర్థముందట. కూచుంటే అర్థముందట. నిలుచుంటే అర్థముందట. పింగళి సూరన్న ఆవిడ దెవరిదో వేనలి వర్ణించాడు, ఆలాగా.

పాపం పండిత శివనాథశాస్త్రి మొదట మొదట మహాదర్శిద్రం వెళ్ళ బోశాడట వారింట్లో అద్దంలేదుట. నీళ్ళల్లో చూచి ఇంటిల్లిపాదీ బొట్లు పెట్టుకునేవారుట. ఆయనకే అద్దముంటే ఎన్నిసార్లు చూచుకునేవాడో.

గాంధీజీ అద్దం ఎందుకు చూచుకోడో నా కిప్పుడు కొంచెం బోధ పడుతూంది. సరే!

చిబుకమ్మీద అక్కడా అక్కడా నాలుగు వెంట్రుకలూ గండస్థల మ్మీద అక్కడా అక్కడా ఒకటి రెండూ కనబడ్డయి. బలుసు ముళ్ళలాగా పట్టుకుని పీకివెయ్యాలని ప్రయత్నించా.

రావిచెట్టు పైకెంత వుంటుందో లోపల అంత ఉంటుందిట. మేరు పర్వతం భూమిలోపల పదహారువేల యోజనా లుందిట. కాని యీ వెం్రటు కలు మా్రతం వాట్లకంటె లోతు.

కానైతే పీకదాని కూతంచేశా. దాంతో గడ్డం మూరెడు ముందుకు సాగి ముందరికి పడ్డా. హరి హరి అనిమటుక్కు ఖదేహావ్.

అటూ ఇటూ చూచా. పక్కగదులన్నీ కత్తులతో తలతలలాడి పోతున్నై. ఎవరినన్నా ఒక కత్తి అరువు కవులుగా అడుగుదామని పక్క సహవాసి గదిలోకి తొంగిచూచా. అతడు కల్యాణమ్మీద ఉన్నాడు. వర్జ్యం లేదు. వారం లేదు. అంతా స్వతం్రతం. ఇప్పటిలాగా స్వరాజ్యమని చెపుతూ డొమినియన్ స్టేటస్ అని అనుక్కుపోయేరు. నమ్మకమైన రిపబ్లిక్. అందులో కూడా హిందూ ముస్లిమ్ అవిభక్త కుటుంబం.

నా పక్కగది వాసి షేక్ఆలీ!

"భయ్యా!" కత్తి ఒకసారి నీ కల్యాణం ఐనాక ఇస్తావా? అని అడగ బోయి మొహమెత్తి చూతునుగదా మొహమంతా లక్ష్మీనిలయం. తామర, తామరతంపర.

ఎవరినిగాని అడగనని ఒట్టేసుకుని ఆపళంగా మేడ దిగి కిందికొచ్చా. మంగలవాళ్ళు కత్తులు నూరుతున్నారు. ఎవరిమీద? సొంతంగా చేసుకునే వాళ్ళమీదే!

వాళ్ళమీద కత్తులు నూరుతూ వెంటనే వైటవే మేడలకు వెళిపోయా. వాకట్లో కూచుని ఉన్న ఒక సిపాయి లేచి సెల్యూట్ చేసి కొంచెం నవ్వాడు.

"ఏం బాబూ నన్ను చూస్తే నవ్వొస్తూందా? అ్రపయత్నంగా నీకు సంతోషం కలిగించినందుకు నాకేమయినా ఇచ్చుకోవా?"

'తప్పక సలహాఇస్తా! ఇది నవ్వనుకున్నారా బాబూ! సరే కాని ఇక్కడ మీరేం కొంటారు చెప్మా? ఏం కొన్నా గుండంలో పడతారు.'

సిపాయి యేమిటి? స్వచ్ఛమైన తెలుగు మాటాడడ మేమిటి? విడ్డూరం. చెన్నపట్నంలో అప్పుడు ప్రతివాడూ తెలుగూ అరవమూ వచ్చిన దుబాసియే. జట్కావాండ్లు మాత్రం తెలుగు వాండ్లముందు అరవమూ, అరవారిముందు తెలుగూ మాటాడా ఏక్-బాసీలే. అప్పుడు చెన్నపట్నం అరవ వారిదని వాదించే బ్రహ్మమానస పుత్రులుగాని, ప్రజాపతులుగాని సృష్టి కాలేదు.

నే నా సిపాయికేసి అనుమానంతో చూచా.

"దేవతా! ఏం కొంటారు?"

ఈ దేవతా అనే గౌరవ సంబోధనం వినడం నా కదే మొదలు. పొంగిపోయి——

"రేజర్" అని బదులు చెప్పా.

ముక్కు మీద వేలువేసుకొని సిపాయి "దేవతా! బయటి కమ్మర్లు అరణాలకు దేశవాళీ కత్తులు చేస్తారు. ఒకటి కొని మంగలి కివ్వండి. అందరూ ఇల్లాచేస్తే మంగళ్ళు బతుకుతారు. మీ కాలమూ, ధనమూ మిగులుతుంది." అంటూ వాగ్బాణాలు వదులుతున్నాడు.

***"Oratory is the harlot of all the arts"*** అని అనుకుంటూ సిపాయిని అవహేళచేసి గృహప్రవేశమైనా.

ఓ కుబేర భవనం! విశ్వరూపాధ్యాయం! కనీవినీ ఎరుగని వస్తువుల బజార్లు.

అక్కడ ఒక చత్వరంలో ఓ పాతికమంది ఆడబడుచు లున్నారు. నన్ను చూచీ చూడడంతోట్టే నా యీడుపిల్ల ఒకతె నా దగ్గరగా వస్తూంది. అప్పటికి "అంగడివీథి పల్లవుల కాసగ" అనే శ్రీనాథుని పద్యాలు నాకూ వచ్చు.

ఆ కన్య సరాసరి నామీదికే రోహిణిలా వచ్చి కరస్పర్శచేసి "తమకు ఏం కావాలంటూ" నన్ను ఒక బజారులోకి లాక్కుపోయింది. చివరకంటా వెళ్ళాక అక్కడ "తమకేం కావాలి" అని నిలవదీసి అడిగింది.

"నాకో రేజర్ కావాలి."

ఆమె అపనమ్మకముగా నాకేసి చూచింది.

"నిజంగానే నాకో మంగలకత్తి తప్పకుండా కావాలి" అని అన్నా.

ఆ బ్రాహ్మణి నా చేయి వదిలిపెట్టి "నీవు మంగలివా" అని అడిగింది.

''అరి దేవుడా! ఈ తెంగలి యేమిటి? మంగలి యేమిటి?" అనుకుని గబగబా వాకట్లోకొచ్చి పడ్డా.

సిపాయి హసన్ముఖంతో ''ఎంత వదుల్చుకున్నారు సామీ? పాస్ చీటీ చూపండి" అని అన్నాడు.

నేనేం చెప్పాలో ఏమీ తోచలా. ఒక నిమిషం అలాగే నిలిచి— ''ఏమీ కానలేదు భయ్యా? నీవు చెప్పినమాట వినొద్దూ?'' అని నేను నా నిర్దోషిత్వం బడాయికొటుతూ ఉండగా ఆ అంగడిపిల్ల వచ్చి— ''ఓ కొత్త మంగలీ పారిపోతున్నావా? ఇదిగో రేజర్. ఇది షెఫీల్డ్‌ది'' అని అన్నది.

''వెల యెంత సుమంగలీ?'' అని అప్రయత్నంగా నా నోట్లోంచి వచ్చినందుకు సిగ్గయింది.

"ఎంతోనా? ఐదు రూపాయల పదిహేనణాలు."

"కడమ అణా ఏం పాపం చేసుకుంద"ని నే నొక యంత్రంలాగా ఆమె చేతిలో డబ్బు పెట్టబోతూ ఉన్నాను. ఆ కొంటెపిల్ల దీని వెల యింకా చాలా ఎక్కువ అని అంటూవుండగా నేను నా చేయి ఈవలికి లాక్కోవా అని ప్రయత్నించాను. కాని ఆ కన్య గట్టిగా నా పాణిగ్రహణం చేసి— నీవు క్రొత్త మంగలివి కాబట్టి గాటుపెట్టుకుంటే దీని వెల యింత ఇబ్బడీ ముబ్బడీ ఔతుంది. నెత్తుటి బొట్టు ఒక్కంటికి పావలా ఐనా విలువ ఉండదా? అని పూర్తి చేసింది.

నా చెయ్యి విసురుగా లాగేసుకొని— "ఆరణాలు పెడితే స్వదేశి కత్తి వస్తుంది. పైగా ఆ బయటి కమ్మరి దేవతా" అని సంబోధిస్తాడు! అని ఒక పావలా తెలియనట్లు కిందవదిలేసి ట్రాము దగ్గరకు పరుగెత్తా.

కొంచెంసేపటిలో ట్రాం వచ్చింది. దాంట్లో ఎక్కికూచున్నా. సిపాయి అక్కడికివచ్చి "దేవతా! పావలా అక్కడ పారేసుకున్నారు" అని ఆ పావలా నా మీద పడేశాడు.

"నీ కోసమే పడేశా."

సిపాయి అక్కరలేదని నవ్వుతూ సెల్యూట్ పెట్టాడు.